ప్రజాశక్తి

ఆదివారం 28 మే 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





మహానాడుకు జిల్లా నేతలు

నియోజకవర్గాల నుంచి తరలివెళ్లిన కార్యకర్తలు



మహానాడులో పాల్గొన్న ఉమ్మడి జిల్లా నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాజమహేంద్రవరంలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు కార్యక్రమానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు తరలివెళ్లారు. ప్రతినిధులుగా హాజరయ్యారు. శనివారం నాడు మహానాడు ప్రారంభమైన సంగతి తెలిసిందే.. ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ వీరాంజనేయస్వామి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుమల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బిఎన్ విజయ్‌కుమార్, ఎంఎం.కొండయ్య, గూడూరి ఎరిక్షన్‌బాబు, దామచర్ల సత్య, నారపుశెట్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు. ఇతర అనారోగ్య కారణాల వల్ల ఇద్దరు నేతలు హాజరుకాలేదు. ఇక నియోజకవర్గాల నుంచీ ముఖ్య నేతలు, క్రియాశీలక కార్యకర్తలు, వివిధ విభాగాల ప్రతినిధులు తరలివెళ్లారు.

డ్రైవర్ నిద్రమత్తుకు..

మూడు ప్రాణాలు బలి



మృతిచెందిన చెన్నకేశవులు, పఠాన్‌వలీ, సాంబశివరావు (ఫైల్)

ఫర్టీలు కొట్టి.. యథాస్థితిలో ఉన్న నాపరాయి లారీ

- నాపరాయి లారీ బోల్తా..
- ముగ్గురు కూలీలు దుర్మరణం
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రేపల్లె

పొట్టకూటి కోసం కూలికెళ్లిన నాపరాయి కూలీలు మృత్యుకౌగిలిలో చిక్కుకున్నారు. రోజూ మాదిరిగానే నాపరాయి లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు వెళ్లిన కష్టజీవులు విగతజీవులయ్యారు. పనులు ముగించుకుని తిరిగి వస్తారని ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా నాపరాళ్ల లారీ బోల్తా పడి.. ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన రేపల్లె మండలం, రావి అనంతవరం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున సుమారు 5.30 గంటల సమయంలో జరిగింది.

పట్టణ సిఐ విజయచంద్ర తెలిపిన సమాచారం ప్రకారం.. ఎపి27 టిఎ 2478 నెంబరు గల లారీ పల్నాడు జిల్లా, మాచర్ల నుంచి రేపల్లెకు నాపరాయి లోడ్‌తో వస్తోంది. రేపల్లె ▶ 2లో



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు, 108 సిబ్బంది



అస్వస్థతకు గురైన బాధితుడు

పోలీస్ మార్క్ విచారణ

- ఆసుపత్రిపాలైన బాధితుడు
- పరిస్థితి విషమం
- గుంటూరుకు తరలింపు

3లో ▶

డ్రైవర్ నిద్రమత్తుకు..

మూడు ప్రాణాలు బలి

(మొదటిపేజీ తరువాయి)

మండల పరిధిలోని రావి అనంతవరం గ్రామ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాల్వలోకి వెళ్లింది. ఈ ప్రమాదం జరిగే సమయంలో లారీ క్యాబిన్‌లో ముగ్గురు వ్యక్తులు ఉండగా, లారీ పైభాగంలో నాపరాళ్ల పైన మరో ముగ్గురు కార్మికులు ఉన్నారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ కాల్వలోకి దూసుకెళ్లే క్రమంలో రెండు పల్టీలు కొట్టి యథాస్థితిలోకి వచ్చింది. ప్రమాదంలో లారీపైన ఉన్న రెంటచింతల మండలం పాశర్లపాడు గ్రామానికి చెందిన చింతమల్ల చెన్నకేశవులు(40), కొనకంచి సాంబశివరావు (60), పఠాన్ వలీ(35) అనే ముగ్గురు కార్మికులపై నాపరాళ్లు పడటంతో వారు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. క్యాబిన్లో ఉన్న పాశర్లపాడుకు చెందిన గుడిపల్లి చిన్న సుబ్బాయ్య, అదే గ్రామానికి చెందిన చల్ల చినకాసాల, రెంటచింతల మండలం మిత్తగూడిపాడుకు చెందిన సైదారావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తీవ్రంగా శ్రమించిన పోలీసులు

మండలంలోని రావి అనంతవరం గ్రామ సమీపంలో నాపరాయి లోడ్ లారీ ప్రమాదానికి గురైందనే సమాచారం అందుకున్న పట్టణ సిఐ విజయచంద్ర పోలీసు సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎక్కడా ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో క్షతగాత్రులను ప్రైవేట్ అంబులెన్స్‌ల ద్వారా గుంటూరు వైద్యశాలకు తరలించారు. నాపరాళ్ల మీద పడి మరణించిన కార్మికుల కోసం పోలీసులు పంట కాల్వలోకి దిగి వెతుకులాట ప్రారంభించారు. సిఐ, మరో ముగ్గురు సిబ్బంది కొన్ని గంటల పాటు శ్రమించి మృతదేహాలను మార్చురీకి తరలించారు. సిఐ విజయచంద్ర చూపిన చొరవ, ఆయన చేసిన కృషిని పలువురు అభినందించారు.

సమావేశ హాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కరణం

ప్రజాశక్తి-చీరాల



సమావేశపు హాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా ఆధునీకరించిన సమావేశ హాలును చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన సమావేశ హాలు సమావేశాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అన్నారు. ఈ హాలును మండల రెవెన్యూ అధికారులు అందరూ సద్వినియోగం చేసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, తహశీల్దారు ప్రభాకర్‌రావు, ఎంపీడీవో నేతాజీ, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్‌బికే చైర్మన్ కావూరి రమణారెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, బుర్ల సాంబశివరావు, బోయిన కేశవులు,నాదెండ్ల కోటేశ్వరరావు, బుర్ల మురళి, గుంటూరు వెంకట సుబ్బారావు, షేక్ మస్తాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్లతో ఇళ్ల వద్దకే పథకాలు: బాచిన

ప్రజాశక్తి-సంతమాగులూరు



వాలంటీరును సన్మానిస్తున్న కృష్ణచైతన్య

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను చేర్చే సంక్షేమ సారథులు వాలంటీర్లేనని రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య తెలిపారు. శనివారం మండల ప్రజా పరిషత్ సమావేశం హాలులో, ఎంపీడీవో సిహెచ్ కృష్ణ అధ్యక్షతన జరిగిన గ్రామ వాలంటీర్ల సేవలకు, సేవా రత్న, సేవా మిత్ర పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఐదుగురు వాలంటీర్లకు సేవారత్న, 263 మంది వాలంటీర్లకు సేవామిత్ర అవార్డులను అందజేశారు. అనంతరం చైతన్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వాలంటీర్లు రెండు కళ్ళు లాంటి వారన్నారు.

జగన్మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు వాలంటీర్లు కీలకమన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని మమ్ము చేయవద్దని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వాలంటీర్ల పనితీరు మెరుగుపరుచు కోవాలన్నారు. పనిచేయని వాలంటీర్లను రిమూవ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, తహశీల్దారు అశోకవర్ధన్, వైసీపీ మండల కన్వీనర్ చింతా రామారావు, నాయకులు బొల్లినేని రామకృష్ణ, నాగబోతు రామాంజనేయులు, దుద్దేల గాలెయ్య, ముసలారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో

రెచ్చిపోతున్న దొంగలు

రెండు రోజుల వ్యవధిలోనే రూ.60 వేల నగదు, ఒక చరవాణి చోరీ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టణం వ్యాప్తంగా ఎక్కడో ఒక చోట ఇళ్లలో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు దొరకకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు ఆర్టీసీ బస్టాండ్‌లను లక్ష్యంగా చేసుకొని ప్రయాణికుల అవతారం ఎత్తి తమ పని కానిచ్చేస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం, శుక్రవారం వరుసగా రెండు రోజులు మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌ను లక్ష్యంగా చేసుకొని ఒక ప్రయాణికుడి వద్ద నుంచి రూ.50 వేల నగదు, మరొక ప్రయాణికుడి వద్ద నుంచి ఒక చరవాణి, 10 వేల నగదు అపహరించారు. ప్రయాణికుల్లా బస్టాండ్ చేరుకుని రద్దీ సమయంలో బస్సు ఎక్కుతున్నట్లుగా నటిస్తున్న దొంగలు జేబులు ఖాళీ చేసి వెంటనే బస్సు దిగిపోతున్నారు. జరిగిన దారుణాన్ని అసలు బాధితుడు గుర్తించేలోగానే అక్కడి నుంచి ఉడాయిస్తున్నారు. బస్టాండ్‌లో ఆర్టీసీ సిబ్బంది పదే పదే 'జేబుదొంగలున్నారు జాగ్రత్త'.. అంటూ మైకులో



మార్కాపురం ఆర్‌టిసి బస్టాండు

చెబుతున్నారు తప్ప, దొంగలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. మరోవైపు మార్కాపురం పట్టణ పోలీసులు కనీసం ఆర్టీసీ బస్టాండ్‌లో ఒకరిద్దరు కానిస్టేబుళ్లతో అయినా సెక్యూరిటీ ఏర్పాటు చేయడంలేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రోజూ వేల మంది రాకపోకలు సాగించే బస్టాండులో కనీసం సీసీ కెమెరాలు లేకపోవడం ఆర్టీసీ వారి నిర్లక్ష్యమేనని పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ రెండు డిపార్ట్‌మెంట్ల అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోయిన వ్యక్తులు బాధితులుగా మిగులుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మూడు సీసీ కెమెరాలు ఉన్నా అవి వినియోగంలో లేకపోవడం దొంగలకు వరంగా మారింది. దీంతో ఎంచక్కా ప్రయాణికుల్లా అవతారమెత్తి తమ పని కానిచ్చేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది కూడా ఇటీవల బస్టాండ్‌లో వరుస చోరీలు జరుగుతున్నాయని, గత నెలలో చైన్ స్నాచింగ్ కూడా జరిగిందని అనధికారికంగా చెబుతున్నారు. పోలీసులు, ఆర్టీసీ అధికారులు స్పందించి సీసీ కెమెరాలను వినియోగంలోకి తెస్తే ప్రయాణికులకు రక్షణతో పాటు, దొంగలను వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని పలువురు అంటున్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాపట్ల ఆర్ట్స్ కళాశాల

పూర్వ ప్రిన్సిపల్ కెఎల్ స్వరూప్ కన్నుమూత

ప్రజాశక్తి-బాపట్ల



బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ మాచర్ల ప్రభుత్వ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కాకా లావణ్య స్వరూప్(60) శనివారం కన్నుమూశారు. బాపట్ల మండలం మురుకొండ పాడుకు చెందిన కెఎల్ స్వరూప్ బాపట్ల పట్టణం ఇస్లాంపేటలో స్థిరపడ్డారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న కెఎల్ స్వరూప్ హైదరాబాదు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ విధుల్లో చేరిన స్వరూప్ కొంతకాలం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. అయితే మేనేజ్‌మెంటు కళాశాలల్లో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్న అధ్యాపకులను ప్రభుత్వ కళాశాలలకు బదిలీ చేస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయంతో స్వరూప్ మాచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిడిగా వెళ్లారు. స్వరూప్ మృతి పట్ల బాపట్ల ప్రాంతంలో పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎందరో విద్యార్థుల ను శిక్షితులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దిన స్వరూప్ మృతికి బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ పాలకవర్గం అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాస రావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, ఉపాధ్యక్షులు డి రామ్మోహనరావు, గెల్లి దిలీప్, పూర్వ కరస్పాండెంట్ పంగులూరి భావనారాయణ చౌదరి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా సొసైటీ పరిధిలోని కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది స్వరూప్ మృతికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. అంత్యక్రియలు ఆదివారం బాపట్లలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.


నర్సీరీలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సరీ ప్లాంటులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-కొండపి: కొండపిలోని జాళ్లపాలెం రోడ్డు శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన నర్సరీ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. అగ్నిమాపక అధికారి ఆర్ మురళీకృష్ణ, సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కొండపి గ్రామానికి చెందిన దేపూరి సుబ్బారావు అనే రైతు జాళ్లపాలెం రోడ్డులో నర్సరి నిర్వహిస్తున్నాడు. అక్కడ ఉండటానికి గుడిసె ఏర్పాటు చేసుకున్నారు. శనివారం నాడు గుర్తు తెలియని వ్యక్తులు అటువైపు వెళుతూ సిగిరెట్టు పడవేయడంతో అగ్నిప్రమాదం జరిగిందన్నారు. వెంటనే చుట్టు పక్కల వారు అగిప్రమాక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో అక్కడ ఉన్న రూ.7 లక్షల విలువైన సరుకులో రూ.1.90 లక్షల సరుకు కాలిపోయింది. మిగిలిన నర్సరీ ప్లాంట్‌కు నష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

జడ శ్రవణ్‌కుమార్‌పై ఆరోపణలకు ఖండన

ప్రజాశక్తి-రేపల్లె


మాట్లాడుతున్న దోవా రమేష్ రాంజీ

మాజీ న్యాయమూర్తి ప్రముఖ హైకోర్టు న్యాయవాది జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్‌పై అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు చేస్తున్న అసత్య నిరాధార ఆరోపణలను జై భీమ్ భారత్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి, న్యాయవాది దోవా రమేష్ రాంజీ, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు ధ్వజమెత్తారు. శనివారం రేపల్లె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 27 సంవత్సరాల వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిగా సెలెక్ట్ అయిన జడ శ్రావణ్ కుమార్ 11 సంవత్సరాలు న్యాయమూర్తిగా సేవలందించి అణగారిన వర్గాల హక్కుల కోసం 2018లో 20 సంవత్సరాల సర్వీస్ ఉన్నప్పటికీ న్యాయమూర్తి పదవికి రాజీనామా చేశారని తెలిపారు. నాటి నుంచి గత చంద్రబాబు ప్రభుత్వం, నేటి వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అణగారిన వర్గాలకు సామాజిక ఆర్థిక సాంస్కృతిక రాజకీయ విధానాల్లో జరుగుతున్న వివక్షపైన దళిత గిరిజన మైనార్టీ వర్గాలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యాకాండలపైన ప్రత్యక్ష పోరాటాలు చేశారన్నారు. వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి.. శ్రావణ్ కుమార్‌పై అవినీతిపరుడని ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఆయన హైకోర్టు ప్రముఖ న్యాయవాదని మాజీ న్యాయమూర్తి అని గుర్తు చేశారు. ఇటువంటి చౌకబారు ప్రకటనలు చేస్తే తప్పక ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. అధికార పార్టీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, జై భీమ్ భారత పార్టీని జడ శ్రావణ్ కుమార్ పోరాట స్ఫూర్తిని ప్రజలకు వివరించి ప్రజా మద్దతును కూడగడతామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్ర బాబురావు, నెరసు వెంకటరావు నాయుడు, పోతార్లంక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బాలినేని, కరణం

బాధిత కుటుంబానికి బాలినేని పరామర్శ

ప్రజాశక్తి-చీరాల: సివిల్స్ పరీక్ష నేపథ్యంలో విద్యార్థిని శ్రావణి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పాఠకులకు తెలిసిందే. విద్యార్థిని తల్లిదండ్రులు గోలి ఆనంద్, కుమారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి బాలినేని వాసు, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి శనివారం ఈపురిపాలెంలోని విద్యార్థిని స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా విద్యార్థిని శ్రావణి చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బాలినేని వాసు మాట్లాడుతూ విద్యార్థిని కుటుంబానికి తాము అన్నివేళలా అండగా ఉంటామని, విద్యార్థిని మృతి చాలా బాధాకరమని అన్నారు. విద్యార్థులందరూ చదువులను ఇష్టంతో చదువుకొని ధైర్యంతో లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. అంతేగాని ఆత్మహత్యలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే ఆమంచి పరామర్శ

విద్యార్థిని శ్రావణి మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఈపురిపాలెంలోని గోలి ఆనంద్ నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. శ్రావణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పోలీస్ మార్క్ విచారణ

ఆసుపత్రి పాలైన బాధితుడు

పరిస్థితి విషమం.. గుంటూరు తరలింపు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

విచారణ పేరుతో పోలీస్ అధికారులు విచక్షణారహితంగా కొట్టిన దెబ్బలకు ఓ వ్యక్తి ఆసుపత్రి పాలైన ఘటన శనివారం రాత్రి మండల పరిధిలోని చిమ్మిరిబండ గ్రామంలో వెలుగు చూసింది. బాధితుడు, అతని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిమ్మిరిబండ గ్రామానికి చెందిన చిన్నగోని వెంకన్న తన ఇంట్లో రూ.43 వేలు నగదు అపహరణకు గురైందని, చోరీకి పాల్పడిన వ్యక్తి అదే గ్రామ ఎస్‌సి కాలానికి చెందిన మురుగుల లక్ష్మయ్యగా పేర్కొంటూ వెంకన్న కుమారులు నవీన్, నాగేంద్రబాబు ఈ నెల 24వ తేదీన మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కోడూరు కమలాకర్ 25వ తేదీ రాత్రి లక్ష్మయ్యను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించారు. పోలీస్ విచారణలో తాను ఎటువంటి దొంగతనం చేయలేదని లక్ష్మయ్య ఎంత ప్రాధేయపడినా వినలేదు. లక్ష్మయ్యను పోలీస్ మార్క్‌తో విచారించడంతో భయపడిన లక్ష్మయ్య చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో శుక్రవారం రాత్రి నగదు జూన్ 15వ తేదీ లోపు వెంకన్న కుటుంబానికి ఇవ్వాలని, లేకపోతే మరల పోలీస్ మార్క్ కోటింగ్ ఇవ్వవలసి ఉంటుందని హెచ్చరించి ఇంటికి పంపించినట్లు బాధితుడు శనివారం మీడియా ముందు వెల్లడించాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో అస్వస్థతకు గురైన లక్ష్మయ్యను 108 సిబ్బంది మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు లక్ష్మయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు. పోలీసులు కొట్టిన దెబ్బలకే లక్ష్మయ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని లక్ష్మయ్య భార్య, సోదరి పోలేరు వైద్యశాల వద్ద విలపించారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-చిన్నగంజాం

మండలంలోని సంతరావూరు గ్రామ శివారులో కోడిపందాలు వేస్తున్న వారిపై శుక్రవారం సాయంత్రం పోలీసులు మెరుపు దాడి నిర్వహించి మూడు కోళ్లను, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 300 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చిన్నగంజాం ఎస్ఐ కే సురేష్ తెలిపారు.

ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-పామూరు


వేమూరి మదన్

పామూరు మండలంలోని కోడి గుంపల గ్రామ శివార్లలో ఒక క్వారీలో వేమూరి మదన్ తన స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లారు. ఈత వచ్చిన స్నేహితులు ఈత కొడుతూ ఉన్నారు. మదన్ ఈతరానందున చూస్తూ ఉన్న క్రమంలో కాలుజారి ప్రమాదవశాత్తు క్వారీలో పడి మృతి చెందాడు. వేమూరి అయ్యన్న తల్లి కళావతులకు ఏకైక కుమారుడు బీటెక్ మొదటి సంవత్సరం విజయవాడ లయోలా కాలేజీలో చదువుతూ సెలవులకు స్వగ్రామం వచ్చాడు. కళ్లముందే కుమారుడు మృతి చెందడంతో వారి కుటుంబంలో, ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ వేమూరి అయ్యన్న కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

30న మండల సమావేశం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఈ నెల 30వ తేదీన నాగులుప్పలపాడు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి నలమలపు అంజమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వేణుకుమారి తెలిపారు.

ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సహకార సంఘం చైర్ పర్సన్లు, శాశ్వత ఆహ్వానితులు హాజరు కావాలని అన్నారు. కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలన్నారు.



మహానాడు బస్సులకు జెండా ఊపుతున్న నరేంద్రవర్మ

మహానాడుకు ప్రత్యేక బస్సుల్లో టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-బాపట్ల

రాజమహేంద్రవరంలో జరుగుతున్న పసుపు పండుగ మహానాడుకు బాపట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో శనివారం మహానాడుకు టిడిపి కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మహానాడులో పాల్గొనేందుకు బాపట్ల నుంచి భారీ సంఖ్యలో బయలుదేరిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రయాణించే బస్సులను నరేంద్రవర్మ జెండా ఊపి ప్రారంభించారు. కార్యకర్తలతో కలిసి అదే బస్సులో నరేంద్రవర్మ మహానాడుకు బయలుదేరి వెళ్లారు.


రోడ్డుపై వేలాడుతున్న చెట్లు

సంతమాగులూరు, అడ్డరోడ్డు గ్రామాల మధ్య

రహదారిపై వేలాడుతున్న చెట్ల కొమ్మలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని సంతమాగులూరు, పుట్టావారిపాలెం గ్రామాల మధ్య గుంటూరు, కర్నూలు రహదారిపై ఇటీవల ఈదురు గాలులకు, భారీ వర్షాలకు రహదారి వెంట ఉన్న చెట్లు కూలి రహదారిని దిగ్బంధనం చేశాయి. అధికారులు కొంతవరకు రోడ్లపై పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. అయితే చెట్లు నుంచి వేలాడుతున్న కొమ్మలను తొలగించకపోవడంతో, రహదారిపై ఎదురెదురుగా వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాత్రులందు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని, వాహనదారులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.


శ్రీనివాసులును సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

పర్చూరు ఉపవిద్యాశాఖాధికారిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు ఉపవిద్యాశాఖాధికారిగా ఆర్ శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పని చేసిన కిరణ్ కుమార్ మైనంపాడు డైట్ కళాశాలకు వెళ్లటంతో ఆయన స్థానంలో మైనంపాడు డైట్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న శ్రీనివాసులును పర్చూరు ఉప విద్యాశాఖాధికారిగా నియమించటంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును పలువురు ప్రధానోపాధ్యాయులు కలిశారు. హిందీ టీచర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ హనుమంతరావు సమస్యలపై హిందీ, తెలుగు పదోన్నతులు నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు, బొప్పుడి ప్రసాద్‌బాబు, ఈదర రాజశేఖర్, గంటా శివయ్య, ఎం శ్రీనివాసరావు, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

జగనన్న బడుగు వికాసం ద్వారా..

పరిశ్రమలకు రూ.13.62 కోట్ల రాయితీ మంజూరు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద జిల్లాలో స్థాపించిన పరిశ్రమలకు రూ.13.62 కోట్ల రాయితీ మంజూరుకు జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా ఆమోదించారు. జిల్లా స్థాయి పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శనివారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో కమిటి ఛైర్మన్, జిల్లా కలెక్టరు అధ్యక్షతన జరిగింది. జిల్లాలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యేలా ఏపిఐఐసికి బాపట్ల జిల్లాలో స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టరు ఈ సందర్భంగా తెలిపారు. అద్దంకి, వేమూరు, బాపట్ల, చీరాల, పర్చూరు, రేపల్లె నియోజకవర్గాలలోని 8 ప్రాంతాలు పరిశ్రమలకు అనువైనవిగా ఉన్నాయన్నారు. ఒక్కొక్క ప్రాంతంలో కనీసం 25 ఎకరాల చొప్పున భూమిని గుర్తించే బాధ్యత ఆర్‌డిఓలకు కేటాయిస్తూ కలెక్టరు నిర్ణయం తీసుకున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కార్పొరేషన్, కేంద్రం నిధులతో ఆ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. పట్టణ ప్రాంతాలలో 3 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టరు ఆదేశించారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద బాపట్ల జిల్లాలో 197 మంది లబ్ధిదారులకు రూ.13.62 కోట్ల మంజూరుకు ఆమోదించామని తెలిపారు. ఇందులో 54 మంది ఎస్సీలు, ఆరుగురు ఎస్టీ లబ్ధిదారులు ఉన్నారని, మిగిలినవి బిసిలకు మంజూరు చేస్తున్నామన్నారు.


జిల్లా స్థాయి పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటి సమావేశంలో జిల్లా కలెక్టరు రంజిత్ బాషా

బాపట్ల జిల్లాలో ఏర్పాటైన శుద్ధజల కేంద్రాలన్నింటినీ ఆర్‌డిఓలు తనిఖీలు చేసి ప్రభుత్వ అనుమతులను పున్నపరిశీలించాలని జిల్లా కలెక్టరు రంజిత్ బాషా తెలిపారు. ప్రజాప్రయోజనార్థం ఈ కార్యక్రమాన్ని అధికారులు తక్షణమే చేపట్టాలని కలెక్టరు ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద 21 మండలాలో 67 యూనిట్లు మంజూరు చేశామన్నారు. గ్రామీణ ఖాదీ బోర్డు కింద రేపల్లెలో రూ.2 కోట్లతో చేనేత క్లస్టర్ నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే చీరాల, చెరుకుపల్లి మండలాలలో ఎన్‌హెచ్‌డిపి క్లస్టర్ అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సాహించాలన్నారు. ఔత్సాహికులు దరఖాస్తు చేసుకున్న వెంటనే పర్యావరణ అనుమతులు, లైసెన్స్, నిబంధనలన్నీ పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సింగిల్ డెస్క్ పోర్టల్లో పరిశ్రమల స్థాపన కొరకు గడిచిన 56 రోజుల్లోనే 119 దరఖాస్తులు రాగా 110 దరఖాస్తులను ఆమోదించినట్లు వివరించారు. చీరాల, అద్దంకి, వేమూరు, బాపట్ల మండలాలలో నూతనంగా స్థాపిస్తున్న పరిశ్రమలకు అన్ని విధాలుగా అధికారులు సహకరించాలన్నారు. నూతనంగా దరఖాస్తులు చేసుకునే ఔత్సాహికులకు అన్నివిధాలుగా అధికారులు సమన్వయంతో సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మదన్మోహన్, ఏడి సూరిబాబు, కమిటీలోని అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఎన్‌డిఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శిష్య బృందం

ఎన్‌డిఎస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఎంతోమంది విద్యార్థులకు క్రీడా స్ఫూర్తిని నింపిన నేషనల్ డిసిప్లేన్ స్కీం (ఎన్‌డిఎస్) ఉపాధ్యాయులు కొసన సుబ్బారావును ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత ఆర్మీ ఉద్యోగి యర్రంశెట్టి సుబ్బారావు సూచించారు. ఎన్‌డిఎస్ ప్రథమ వర్ధంతిని శనివారం రైల్వే స్టేషన్ వద్ద గల తన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సహచర ఉద్యోగులు మరియు శిష్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌డిఎస్ విద్యార్థి దశ నుంచి కబడ్డీ, సాఫ్ట్ బాల్ క్రీడల్లో మక్కువతో క్రీడా స్ఫూర్తిని కలిగి అదే రీతిలో ఉపాధ్యాయునిగా విద్యార్థుల్లో క్రీడా భావాన్ని కలిగించి ఎంతోమందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. క్రమ శిక్షణ కలిగిన కొసన సుబ్బారావు స్ఫూర్తితో పయనించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొసన రమేష్, రఘు, వెంకటేశ్వరరావు, శ్రీనాథ్, గార్యాల వెంకకటేశ్వరరావు, అల్లాబక్షు తదితరులు ఉన్నారు.

ఆదర్శమూర్తి బోయపాటి వెర్రెమ్మ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించి ఎంతోమంది కమ్యూనిస్టు యోధులకు ఆసరా కల్పించి పరోక్షంగా సిపిఎం పార్టీకి అండగా నిలిచిన మహెూన్నత వ్యక్తి బోయపాటి వెర్రెమ్మ. భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామంలో 1924లో జన్మించి కొల్లూరు మండలం కిస్కిందపాలెం గ్రామంలో బోయపాటి వీర బసవయ్యను వివహామాడింది. ఆమెకు కుమారుడు బోయపాటి లక్ష్మీ కష్ణ ప్రసాదరావు, కుమార్తె పమిడిముక్క విజయ భారతి లక్ష్మీ ఉన్నారు. కుమారుడు బిఎల్‌కె ప్రసాదరావు సిపిఎం నాయకునిగా, రైతు సంఘం నాయకులుగా ఉన్నారు. పెసర్లంక గ్రామ మాజీ సర్పంచ్ గుళ్లపల్లి భాస్కరరావు సోదరి అయిన వెర్రెమ్మ మొదటి నుంచి ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరురాలుగా ఉంటూ చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా జరిగిన భూ పోరాటంలో నిలబడిన కమ్యూనిస్టు యోధులు కొరటాల సత్యనారాయణ, మోటూరు హనుమంతరావు వంటి పలువురు నాయకులకు ఆశ్రయం కల్పించారు. వారికి భోజన సదుపాయాలు, వసతి ఏర్పాట్లను కల్పించేవారు.

వెర్రెమ్మ పేరున బ్రహ్మజ్ఞాన పీఠం ఏర్పాటు

బోయపాటి వెర్రెమ్మ అత్యంత ఆదర్శ



భావాలు కలిగి ఉండటంతో జ్ఞాన ప్రసూనాంబగా నామకరణం చేసి తూర్పు గోదావరి జిల్లా ఆలమూరులో ఆమె శిష్యులు ముకుందేశ్వర స్వామి బ్రహ్మ జ్ఞాన పీఠంను స్థాపించారు. గత 6 నెలలుగా నడుస్తున్న ఈ జ్ఞాన పీఠంలో దాదాపు వెయ్యి మంది శిష్యులున్నారు. వెల్లటూరు, కిష్కిందపాలెం గ్రామాల్లో కూడా జ్ఞాన పీఠాలను ఆమె శిష్యులు నిర్వహిస్తున్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. శనివారం బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు వద్దకు వెళ్లి వాళ్ల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనిని 200 రోజులకు పెంచాలని అన్నారు. కనీస సౌకర్యాలు, మంచి నీరు, మెడికల్ కిట్ పని ప్రదేశాల్లో కల్పించాలన్నారు. గతంలో లాగా సమ్మర్ అలవెన్స్, పలుగు, పారకు డబ్బులు ఇవ్వాలని అన్నారు. గత సంవత్సరం చేసిన పనికి డబ్బులు రావాలని, రెగ్యులర్‌గా కూలి డబ్బులు పడేవిధంగా చూడాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఐక్య పోరాటంతోనే ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోగలమని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికుల ప్రయోజనాల్ని పెద్దఎత్తున దెబ్బతీస్తుందని, గత ఎనిమిదేళ్ల కాలంలో ఉపాధి హామీ పథకానికి కేటాయిస్తున్న నిధులు వేల కోట్లు తగ్గించి వేయడం ద్వారా ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చాలని ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఇదిలాగే కొనసాగితే దేశంలోని కోట్లాదిమంది ఉపాధి హామీ కార్మికుల ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు. ప్రధాని మోడీ ప్రభుత్వం ఈ దేశంలో ఉన్న కార్పొరేట్ సమస్యలకు లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేస్తూ రైతులు పేద ప్రజలకు వంద రోజులు కూడా పని దక్కనీయకుండా చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఉపాధి కూలీలకు అతి తక్కువ కూలి డబ్బులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో 480 రూపాయలు, కేరళలో 600 రూపాయలు అక్కడున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూలిని గ్యారెంటీ చేస్తే, మన రాష్ట్ర ప్రభుత్వం 250 రూపాయలు కూడా ఉపాధి హామీ కార్మికులకు ఇవ్వలేకపోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య తదితరులు

ప్రజాశక్తి 5
ఆదివారం 28 మే 2023

పొగాకు బేళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు బోర్డు పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 18 గ్రేడ్ వన్ రకం పొగాకు బేళ్లను బోర్డు విజిలెన్స్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. టుబాకో బోర్డు విజిలెన్స్ అధికారులు అక్రమంగా తరలిస్తున్న పొగాకుబేళ్లను బోర్డు పరిధిలోని సింగరాయకొండ వద్ద గుర్తించి అడ్డగించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అనుమతి పత్రాలు అడగగా లేవని చెప్పడంతో అక్రమ పొగాకుగా నిర్ధారించుకుని ట్రాక్టర్‌తో సహా 18 పొగాకు బేళ్లను టంగుటూరు బోర్డుకు తరలించారు. రెండున్నర క్వింటాళ్ల తూకం ఉన్న పొగాకు విలువ మార్కెట్లో రూ 4.5 లక్షలు ఉంటుందని విజిలెన్స్ అధికారులు అంచనా వేశారు. పొగాకు బేళ్లను గ్రామాలలో అక్రమంగా విక్రయించినా, కొనుగోలు చేసినా జరిమానా విధించడంతో పాటు సదరు రైతుల బ్యారన్ లైసెన్సును రద్దు చేస్తామని ఏఎస్ శ్రీనివాసరావు హెచ్చరించారు. అక్రమ కొనుగోళ్ల గురించి సమాచారం తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచడంతోపాటు తగిన పారితోషకం కూడా ఇవ్వనున్నట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. దాడి చేసి పొగాకు బేళ్లను స్వాధీనం చేసుకున్న వారిలో బోర్డు విజిలెన్స్ అధికారులు గౌతమ్, సాయి ప్రశాంత్, నవీన్ నాయక్, తదితరులు ఉన్నారు.

'శ్రీరామ్' హాస్పిటల్‌కు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి అనుమతిని మంజూరు చేసిందని డాక్టర్ చాపల వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సౌకర్యం వల్ల అన్ని డిపార్టుమెంట్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి మీద ఆధార పడిన కుటుంబ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంట్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు, ఏపిఎస్ఆర్‌టిసి డిపార్ట్ మెంట్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు, పోలీస్ డిపార్ట్ మెంట్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు, టీచర్లు, ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు.. మొదలగు అన్ని విభాగాల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, లబ్ది పొందొచ్చని చెప్పారు ఈ సదవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అందరూ వినియోగించుకోవాలని కోరారు.

వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలో 2019లో ప్రారంభమైన సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని, ఈ వ్యవస్థల వల్లనే ప్రభుత్వానికి మంచి పేరు, గుర్తింపు వచ్చాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం పుల్లలచెరువులో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై వలంటీర్లను సత్కరించారు. వలంటీర్లను సత్కరించడం ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల్లో ఒకటని, సత్కారానికి వలంటీర్లు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి మందా లాజరు, జడ్పిటిసి వాగ్యా నాయక్, ఎంపిటిసి లింగాగుంట్ల రాములు, మం డల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, సుద్దకురవ తాండా సర్పంచ్ బి వెంకటేశ్వర్లు నాయక్, డిఎల్‌డిఓ బివిఎన్ సాయికుమార్, తహశీల్దార్ దాసు, నాయకులు భూమి రెడ్డి సుబ్బారెడ్డి, కొర్లకుంట జానకీరఘు, దోమకులు వెంకటేశ్వర్లు, కాశయ్య, లక్ష్మీబాయితో పాటు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

మండల సమావేశానికి ప్రజాప్రతినిధులు డుమ్మా

ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న వైనం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం నాడు యంపిపి కె.స్వప్నకుమారి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. మండలంలో 19 పంచాయితీలలో 18 మంది సర్పంచ్‌లు, 12 మంది ఎంపిటిసిలు ఉన్నారు. వారిలో కనీసం సగం మంది అయినా సర్వసభ్య సమావేశానికి హాజరుకాకపోవడం గమనార్హం. మూడు నెలల కొకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి ఒకసారి అధికారులు, ఇంకోసారి ప్రజాప్రతినిధులు డుమ్మా కొడుతూ ఉండటంతో గ్రామాలలో ఎక్కడ సమస్యలు అక్కడే మరగున పడిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సర్వసభ్య సమావేశంలో మండల వ్యవసాయ అధికారి వి.రాము వ్యవసాయానికి సంబంధించిన నివేదికను చదువుతుండగా వైస్ యంపిపి వేముల ప్రసాద్ వ్యవసాయ అధికారి పనితీరుపై మండిపడ్డాడు. గ్రామాలలో రైతుల సమస్యలపై స్పందించపోగా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, వ్యవసాయ అధికారి విధులకు సరిగా హాజరు కావడం లేదని, అతని వృత్తికి తగిన అర్హుడు కాదని వెల్లడించారు. పెదకండ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాలలో గతంలో ఓటిఎస్ పేరుతో లక్షలలో రూపాయలు వసూలు చేయడం జరిగిందని, ఇంతవరకు వాటికి సంబంధించిన పత్రాలు ఇవ్వలేదని తహశీల్దారు పి.సింగరావును అడిగారు. తహశీల్దారు పి.సింగరావు మాట్లాడుతూ వెంటనే సమస్యను పరిష్కరిస్తామని సమాధానం ఇచ్చారు. కరెంటు ఏఈ కుంచాల కోటయ్య మాట్లాడుతూ కొండపి మండలంలో నూతనంగా జాళ్లపాలెంలో, అనకర్లపూడిలో సబ్‌స్టేషన్ పెట్టుకొనుటకు నివేదికను పంపించడం జరిగిందన్నారు. స్త్రీశిశు సంక్షేమ సంఘం చైర్మన్ మరియు కొండపి జడ్పిటిసి మారెడ్డి అరుణవెంకటాద్రి రెడ్డి మాట్లాడుతూ వీఆర్‌వోలు గ్రామాలలో సక్రమంగా పనిచేయడం లేదన్నారు. వీరు బదిలీపై వెళుతున్నారని తహశీల్దారు చెప్పారు. మరలా వచ్చే వారు కూడా ఇదే విదంగా ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత తహశీల్దారుపై ఉందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిదులు ఎక్కువ మంది హాజరు కాకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇలాంటి సమావేశానికి ప్రతి ప్రజాప్రతినిధి హాజరు అయ్యి గ్రామాలలో ఉంటే సమస్యలను అధికారులు దృష్టి తీసుకొని పోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో యంపిడివో బ్రహ్మయ్య పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పెదకండ్లగుంట సర్పంచ్

కావాలనే ఊరు వదిలిపోయారు..

- అధికారులు ముందు వాపోయిన మత్స్యకారులు
- గ్రామ బహిష్కరణపై విచారణ చేపట్టిన జిల్లా అధికారులు



మత్స్యకారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

ప్రజాశక్తి -సింగరాయకొండ

తాము ఎవరినీ గ్రామ బహిష్కరణ చేయలేదని, కావాలనే అప్పుడు ఊరు వదిలి పోయారని, ఇప్పుడు ఇబ్బంది పెడుతున్నారని మత్స్యకారులు అధికారుల ఎదుట వాపోయారు. మండలంలోని ఊళ్లపాలెం పంచాయితీలోని దేవళంపల్లిపాలెంలో గత మూడు సంవత్సరాల క్రితం గ్రామ బహిష్కరణ విషయంలో శనివారం మానవ హక్కుల కమిషనర్ ఆదేశాలు మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీఓ కె.విశ్వేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. దేవళంపల్లిపాలెంకు చెందిన కన్నా నాగరాజు కుటుంబం చర్చికి వెళుతూ ఉండేవాళ్లు. గ్రామంలో గుడి ప్రారంభోత్సవం సందర్భంగా మత్స్యకారులు ఎవరు ఊరు వదిలి వెళ్లరాదని.. బయట వాళ్లు ఎవరూ ఊళ్లోకి రాకూడదని అప్పుడు నిర్ణయించుకున్నారు. అయితే చర్చికి వెళ్తున్న కన్నా నాగరాజు కుటుంబం బయటికి.. ఊళ్లోకి.. వస్తూ పోవడంతో గ్రామస్తులు ఆ కుటుంబాన్ని పిలిచి ఇలా చేయడం మంచిది కాదని వివరించారు. కన్నా నాగరాజు కుటుంబం చర్చికి పోతూ ఉండటంతో అప్పట్లో చర్చిలో ఉన్న పాస్టర్ వెయ్యి రూపాయలు కడితే పదివేలు ఇస్తానని మోసం చేసిన విషయం కూడా అప్పట్లో గ్రామస్తులు నాగరాజుతో మాట్లాడారు. ఇవన్నీ మనసులో పెట్టుకొని కావాలని గ్రామం వదిలేసి.. గ్రామాన్ని ఇబ్బంది పెడుతున్నారని మత్స్యకారులు అధికారుల ముందు వాపోయారు. చర్చిలో ఇష్టం వచ్చినట్టు మైకు పెట్టడం ద్వారా చదువుకునే విద్యార్థులకు బాగా ఇబ్బంది జరిగిందని గ్రామస్తులు వివరించారు. నాగరాజు కుటుంబసభ్యుల్ని ఎవరినీ గ్రామానికి బహిష్కరణ చేయలేదని, అంత అవసరం మాకు లేదని చెప్పారు. గ్రామంలో ఇల్లు కూడా ఉందని, కుటుంబ సభ్యులు అందరూ ఇబ్బందులు లేకుండా మాట్లాడుకుంటున్నారని వివరించారు. చర్చి కోసం స్థలం కూడా గ్రామమే కొనిచ్చిందన్నారు. సముద్రంలోకి వెళ్లి చేపలు పట్టుకొని బతికే తాము వేట లేకపోతే కూలికి వెళతామని..ఇలా ఇబ్బందులు పెడుతూ ఉంటే తాము ఎలా బతకాలో చెప్పాలని కోరారు. ఇప్పటికే సింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌లో ఇరువురిపై కేసులు నమోదు ఉన్నాయి. నాగరాజు తరుపున లాయరు కొంత సమయం అడగడంతో అధికారులు మాట్లాడుతూ మరోసారి సమావేశమవుదామని.. గ్రామస్తులంతా ఐక్యతతో ఉండాలని సూచించారు. గ్రామం అంతా కలిసిమెలిసి ఉండాలన్న ఉద్దేశంతో ఇలా సమావేశమై మత్స్యకారులతో చర్చించడం జరిగిందన్నారు. నాగరాజు కుటుంబ సభ్యులు గ్రామం వదిలి వెళ్లిపోయారని, వాళ్లు వస్తే ఎవరూ ఏమీ అనొద్దని చెప్పారు. నాగరాజు కుటుంబ సభ్యులు గ్రామానికి వస్తే ఎలాంటి ఇబ్బంది లేదని దేవలంపల్లిపాలెం మత్స్యకారులు జిల్లా స్థాయి అధికారులకు వివరించారు. సమావేశంలో తాసిల్దార్ సిహెచ్ ఉష, డిప్యూటీ తాసిల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు, సర్పంచి పాకనాటి అనసూయమ్మ, వైసీపీ నాయకులు పాకనాటి సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆర్ సైదులు, సింగరాయకొండ ఎస్సై ఫిరోజా ఫాతిమా, టంగుటూరు ఎస్సై ఖాదర్ బాషా, జరుగుమల్లి ఎస్సై శ్రీనివాసరావు, ఆర్ ఐ తన్నీరు తిరుమలరావు, ఏఎస్ఓ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు.

బాల్యవివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి

సిడిపిఒ మల్లేశ్వరి

ప్రజాశక్తి-సింగరాయకొండ

బాల్యవివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి చేయాలని సిడిపిఒ మల్లేశ్వరి సూచించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మరియు సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఆధ్వర్యంలో శనివారం సింగరాయ కొండ షాదిఖానాలో 'బాల్యవివాహాల నిర్మూలన – గ్రామస్థాయి కమిటీల పాత్ర' అనే అంశంపై సింగరాయకొండ, టంగుటూరు మండలాలకు చెందిన అంగన్వాడి కార్యకర్తలకు ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలు మన ప్రతి కదలికను గమనిస్తారని, వారికి మంచి అలవాట్లను నేర్పాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ షేక్ రిజ్వానా, సూపర్వైజర్లు నాగలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

బాలకోటమ్మ కుటుంబసభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన బత్తుల బాలకోటమ్మ దశదినకర్మ శనివారం టంగుటూరులో జరిగింది. ఈ కార్యక్రమానికి పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మా దాసి వెంకయ్య ముఖ్య అతిథిగా హాజరై బాల కోటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైసీపీ నాయకులు దేవరపల్లి వరుణ్, బొడ్డు శ్రీనివాస రావు, దండేల వినోద్, ఏల్చూరి మాధవరావు ఉన్నారు.

వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని సంజీవిని అనాధ, వృద్ధాశ్రమానికి యూవ్ యువసేన ఆధ్వర్యంలో శనివారం వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వైవీ యువసేన అధ్యక్షులు బాలు మాట్లాడుతూ సంజీవని అనాధ, వృద్ధాశ్రమ నిర్వాహకులు తమకు వంట సామగ్రి కొరత ఉందని తెలుపగా వెంటనే తాము స్పందించి 5000 రూపాయల వంట సామాగ్రిని అందజేసినట్లు తెలిపారు. అలాగే ఇవే కాక ఆశ్రమానికి మున్ముందు ఎటువంటి అవసరాలు ఉన్న తాము సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రాజశేఖర్, మహేశ్వర అపార్టెంట్ మేనేజింగ్ పార్టనర్ చెరెడ్డి యర్రా రెడ్డి, దండెబోయిన పెద్ద రమణ పాల్గొన్నారు.

897 పొగాకు బేళ్లు అమ్మకం


ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం నాడు 897 పొగాకు బేళ్లు అమ్ముడయ్యాయని వేలం నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం కేంద్రానికి కొన్ని గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 961 బేళ్లను అమ్మకంలో ఉంచారు. అందులో 897 బేళ్లు వివిధ కంపెనీల వారు కొనుగోలు చేయగా మిగిలిన 64 బేళ్లు వివిధ కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అందులో అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.151, సరాసరి ధర రూ.199.35 పలికిందన్నారు.

30 నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-సింగరాయకొండ

మండలంలోని పాత సింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 9 వరకు జరుగుతున్నాయని పాలకమండలి చైర్మన్ పామర్తి మాధవరావు, కార్యనిర్వహణ అధికారి పి.కృష్ణవేణి తెలిపారు. శనివారం నాడు బ్రహ్మోత్సవాలకు సంబంధించి దేవస్థానంలో కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పామర్తి మాధవరావు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడో తేదీన శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు, నాలుగో తేదీన రాధాడు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రాజుకోటేశ్వరమ్మ, గోకరాజు పాపయ్య, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, దేవస్థానం ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకటలక్ష్మి, నరసింహ చార్యులు, మట్టా సుబ్బారావు, రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆంజనేయరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మద్దిశెట్టి

వైసిపి నేత మృతికి 'మద్దిశెట్టి' సంతాపం

ప్రజాశక్తి-దరిశి

తాళ్ళూరు మండలం మాధవరం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు నుసుం చిన్న ఆంజనేయరెడ్డి (59) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆంజనేయరెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర, ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ఇడమకంటి వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపిపిలు ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, ప్రియాంక నాగార్జునరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, గ్రామనాయకులు సంతాపం ప్రకటించారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-కొండపి

ప్రతి విద్యార్థీ వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని కొండపి గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. శనివారం నాడు కొండపి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి 18 మంది విద్యార్థులు హాజరయ్యారు. డ్యాన్స్, పాటలపోటీలు, యోగ, పుస్తకపఠనం, కథలు చెప్పటం.. మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు కథల పుస్తకాలలోని సారాంశాన్ని గ్రంథపాలకుడు కోటేశ్వరరావు వివరించారు.



కవితా సంచికను ఆవిష్కరిస్తున్న నాయకులు

'ఎన్‌టిఆర్' కవితా సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు

ఎన్‌టిఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో యన్‌టిఆర్ శతజయంతి వేళ 'శత కవితా హేల' అనే నూరు కవితల పుస్తకాన్ని ప్రచురించటం తన అదష్టమని ఎన్‌టిఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు అన్నారు. మే 27న శనివారం స్థానిక ఒంగోలు పట్టణంలోని మల్లయ్య లింగం భవనంలో ఈ పుస్తకావిష్కరణ సభ జరిగింది. యన్‌టిఆర్ పురస్కార గ్రహీత అన్న నల్లూరి వెంకటేశ్వర్లు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా బెజవాడ వెంకట్రావు, తేళ్ళ అరుణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, యు.వి.రత్నం, షేక్ మహబూబ్‌జాన్ ప్రసంగించారు సభకు సింహాద్రి జ్యోతిర్మయి సంచాలకత్వం వహించారు.

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-కొనకనమిట్ల



వాలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ప్రత్యక్ష వారధులే వాలంటీర్లని చినమన గుండం ఎంపిటిసి కోంద్రు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని యం పిడిఒ రావూరి జనార్ధన్ వాల్లంటీర్లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ వివరిస్తున్న ఘనత వాలంటీర్లకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.చెంచయ్య, ఎఒ పి.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

వైసిపి కొండపి ఇన్‌ఛార్జి అశోక్‌బాబు

ప్రజాశక్తి-జరుగుమల్లి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా సంస్కరణలతో ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి పాలన సాగిస్తున్నారని కొండపి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. మండలంలోని పైడిపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.రామకృష్ణ, పైడిపాడు సర్పంచి నాగినేని భాస్కర్, పచ్చవ సర్పంచి కొండాబత్తిన కృష్ణయ్య, మండల జెయస్‌సి కన్వీనరు తాటికొండ రామచంద్రరావు, నల్లూరి సురేంద్ర, మూలే శ్రీనివాసరెడ్డి, బత్తిన ప్రసాదు, కసుకుర్తి బద్రి, పల్లాల శివ కోటిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వాలంటీర్లు బాధ్యతతో పనిచేయాలి

సంక్షేమ పథకాలు అమలులో కీలక పాత్ర పోషించిన వాలంటీర్లు మరింత భాధ్యతతో పనిచేయాలని కొండపి నియోజక వర్గ వైసిపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని చిరికూరపాడు, నర్సింగోలు, పైడిపాడు, చతుకుపాడు,



మహిళతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కామేపల్లి, పచ్చవ, వర్ధినేనివారిపాలెం గ్రామాలలోని వాలంటీర్లకు వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. వాలంటీర్లను ప్రశంసాపత్రం, మెడల్, దుశ్శాలవాలతో అశోక్‌బాబు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.రామకృష్ణ, వైసిపి నాయకులు బెల్లం సత్యన్నారయణ, పైడిపాడు సర్పంచి నాగినేని భాస్కర చౌదరి, పచ్చవ సర్పంచి కొండాబత్తిన కృష్ణయ్య, దావగూడూరు సర్పంచి చెన్నారెడ్డి రామ్మూర్తి, పచ్చవ పంచాయితీ కార్యదర్శి పోకూరి అశోక్‌బాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యం

చిల్డ్రన్ క్లబ్ రాష్ట్ర నాయకురాలు రమాదేవి

ప్రజాశక్తి-దరిశి

నేటి సమాజంలో సామాజిక విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించుకోవడమే విద్యార్థుల లక్ష్యంగా ఉండాలని చిల్డ్రన్ క్లబ్ రాష్ట్ర నాయకురాలు కె. రమాదేవి అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో 15 సంవత్సరాల లోపు బాలబాలికలకు బాలోత్సవం సందర్భంగా ఆటలు, పాటలు, డ్రాయింగ్, డ్యాన్స్, నృత్యరూపాలు, నీతి కథలు, సైన్సు సరదాలు, దేశభక్తిని పెంపొందించడం వంటి కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు బి.రాజారమేష్ దేశభక్తి గీతాలు పాడి వినిపించారు. బెలూన్స్‌తో ఆటలు,



మాట్లాడుతున్న రమాదేవి

బాలికల అభిరుచులు, పేపరు క్రాఫ్టింగ్, నృత్యం నేర్పించారు. కార్యక్రమానికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెవి పిచ్చయ్య అధ్యక్షత వహించగా గ్రంథపాలకురాలు ఎల్.సుమతి, 65 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

గుర్రలమడుగు కాలనీలో 'గడపగడపకూ..'

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని రేగుమాను పల్లి సచివాలయం పరిధిలోని గుర్రలమడుగు కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి ఇంటింటికీ తిరిగి జగనన్న ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వారికి సంక్షేమ పథకాల



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఉడుముల రామ నారాయణరెడ్డి, సర్పంచ్ బోయిన వెంకటేశ్వర్లు, ఎంపీపీ మురళి, కన్వీనర్ శంకర్‌రెడ్డి, జడ్‌పిటిసి ఏడుకొండలు, ఎంపిటీసీ చిన్నమ్మ, ఎస్సీసెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలను సిద్ధం చేస్తున్న జెవికె టీమ్ సిబ్బంది

పాఠశాలలు తెరిచే లోపు జెవికె కిట్లు

ఎంఇఒ రవి

ప్రజాశక్తి-చీమకుర్తి

పాఠశాలలు తెరిచే లోపు పాఠశాలలకు జెవికె కిట్లు అందించనున్నట్లు ఎంఈఓ టి రవి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు నేరుగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను అందజేయడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాఠ్యపుస్తకాలను గ్రేడింగ్ చేసి, తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యాసంవత్సరం తెరిచే లోపే జెవికె కిట్లు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. కిట్లను ప్రత్యేక వాహనం ద్వారా ఆయా పాఠశాలలకు పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

మానసిక వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

స్కిజోఫ్రీనియా వారోత్సవాల సందర్భంగా ఒంగోలు, జిజిహెచ్‌లోని ఎఆర్‌టి సెంటర్‌లో మానసిక వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ జోసఫ్ సామ్యూల్, డిఎంహెచ్‌పి ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ చంద్రశేఖర్, సైక్రియాట్రిస్ట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్ పాల్గొని.. మాట్లాడారు. మానసిక వ్యాధులైన స్కిజోఫ్రీనియా, యాంగ్జైటీ, డిప్రెషన్, మత్తుపదార్థాలకు బానిసలుగా మారడం, అనుమానం, ఆత్మహత్య ఆలోచనలు, తదితర వాటిని అదుపు చేసేందుకు పరిష్కార మార్గాలకు సూచించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కూలీల మస్టరు పరిశీలన

ప్రజాశక్తి-జరుగుమల్లి

ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పనులకు కూలీలు అందరూ హాజరయి లబ్ధి పొందాలని జరుగుమల్లి ఎంపిడిఓ పి.రామకృష్ణ అన్నారు. మండలంలోని చతుకుపాడు గ్రామంలో ఉపాది . హామీ పథకం పనులు చేస్తున్న కూలీల మస్టర్లు పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలు అందరూ రూ.272 లు వేతనం వచ్చే లాగా, కొలతల ప్రకారం పనిచేయాలని సూచించారు. ఎండలు తీవ్రత ఎక్కువగా వున్నందున , కూలీలు ఉదయాన్నే పనికి హాజరయ్యే విధంగా చూడాలని ఫీల్డు అసిస్టెంట్ ని ఆదేశించారు. కూలీలు అందరూ 100 రోజులు పనిపొందే విధంగా పని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డు సహాయకులు మాల్యాద్రి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



పెళ్లికుమార్తెను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

వివాహ వేడుకలలో 'బూచేపల్లి'

ప్రజాశక్తి-దరిశి

తాళ్ళూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కోటా వెంకటేశ్వరరెడ్డి కుమార్తె వివాహానికి జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఆశీర్వదించిన వారిలో ఆ గ్రామ సర్పంచ్, తాళ్ళూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మారం ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

'బ్లడ్ క్యాన్సర్‌కు భయపడొద్దు'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బ్లడ్ క్యాన్సర్లకు భయపడొద్దని, ముందుగా గురిస్తే నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హైదరాబాద్ యశోద హాస్పిటల్ సీనియర్ హెమటాలజీ ఆంకాలజిస్ట్ డాక్టర్ గణేష్ ఎస్.జైషేత్వార్ పేర్కొన్నారు. స్థానిక ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ మాసం సందర్భంగా బ్లడ్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు, వ్యాధులను పూర్తిగా నయం చేసేందుకు ఉన్న మార్గాలను తెలియజేస్తున్నామన్నారు. చికిత్స విజయంతమైతే పూర్తిగా సాధారణ జీవితాన్ని గడపగలరని తెలియజేశారు. బ్లడ్ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం వల్ల పూర్తిగా నయం అయ్యే అవకాశాలను మెరుగుపరుస్తుందన్నారు. 2023లో వచ్చే మెజారిటీ బ్లడ్ క్యాన్సర్‌లు ఆధునిక కీమో థెరపీ, ఇమ్యునోథెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ వంటి అత్యంత అధునాతన చికిత్స ఎంపికలతో నయం చేయవచ్చన్నారు. ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలుకు చెందిన 65 ఏళ్ల సాంబశివరావు బిఎంటి (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) చేయించుకున్నారని, ఈ వాస్తవాన్ని గ్రహించారన్నారు. పూర్తిగా సాధారణ జీవితాన్ని గడుపుతున్నారని తెలియజేశారు. సమావేశంలో సాంబశివరావు, యశోద హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

దాహార్తి తీరుస్తున్న నిమ్మకాయ చలివేంద్రం

ప్రజాశక్తి-చీమకుర్తి



నిమ్మకాయ చలివేంద్రం ఇదే..

రామతీర్థం సమీపంలో జ్యోతి ఎక్స్‌పోర్ట్సు సెంటర్ కర్నూలు-ఒంగోలు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన నిమ్మకాయ చలివేంద్రం వేలాదిమంది ప్రయాణీకుల దాహార్తిని తీరుస్తోంది. వెలుగు సుబ్బారావు ఏర్పాటు చేసిన చలివేంద్రంను రెండు నెలల క్రితం యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. అప్పటి నుంచి రోడ్డుపై ప్రయాణించే వాహనాల వాళ్ళు, ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకులు, గ్రానైట్ గనులలో పనిచేసే కార్మికుల దాహార్తిని తీర్చుతూ అందరి మన్ననలు పొందుతోంది. ఇటీవల కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చలివేంద్రాన్ని తగులబెట్టారు. అయితే నిర్వాహకులు రెండు రోజుల్లోనే చలివేంద్రాన్ని పున:ప్రారంభించారు. తిరిగి చలివేంద్రం పనిచేయడం ప్రారంభించింది. ప్రయాణీకుల దాహార్తిని తీర్చడానికి నిర్వాహకులు చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.

ఖరీఫ్ వస్తున్నా..

కల్లాల్లోనే రబీ పంటలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-పంగులూరు

మరో రెండు మూడు రోజుల్లో రబీ సీజన్ పూర్తవుతుంది. ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌ను ప్రారంభించేందుకు కొంతమంది రైతులు సిద్ధమవుతున్నారు. అయినా రబీ తాలూకు పంటలు పూర్తిగా రైతు ఇంటికి చేరలేదు. ఇంకా కొన్ని పంటలు పొలాల్లోనే ఉన్నాయి. పంగులూరు ప్రాంతంలో ఈ సంవత్సరం రబీలో భాగంగా మిర్చి, పొగాకు, మొక్కజొన్న, శనగ పంటలను రైతులు సాగు చేశారు. ఈ సంవత్సరం రబీ ప్రారంభం నుంచి వ్యవసాయం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంది. అకాల వర్షాలు రబీ ప్రారంభంలోనే వ్యవసాయాన్ని దెబ్బతీశాయి. డిసెంబర్ 2,3 వారాల్లో కురిసిన అకాల వర్షాలకు శనగ, మిర్చి పైర్లు మునిగిపోయాయి. కొన్నిచోట్ల పైర్లను చెడగొట్టి, రైతులు మళ్లీ విత్తనాలు తెచ్చుకొని వ్యవసాయాన్ని ప్రారంభించారు. దీంతో రైతాంగానికి వ్యవసాయంలో అదనపు భారం పడింది. అయినా ఏదో ఆశతో రైతాంగం వ్యవసాయాన్ని వదలకుండా చేశారు. తరువాత వాతావరణం అనుకూలించి పంటలు బాగున్నాయి. ఈ సంవత్సరం దిగుబడులు బాగా వస్తాయి అనుకున్న సమయంలో, మార్చి చివర్లో, ఏప్రిల్ ప్రారంభంలో మళ్లీ అకాల వర్షాలు వచ్చాయి. ఈ వర్షాలకు మిర్చి పూత రాలి, కాయలు రాలిపోయి, తాలు కాయలు ఏర్పడ్డాయి. మిర్చి రైతుల ఆశలు అడియాసలయ్యాయి. ధరలు కూడా భారీగా పతనమయ్యాయి. దిగుబడులు కూడా తగ్గిపోయాయి. రైతులు అయినకాడికి అమ్ముకోగా, కొంతమంది కోల్డ్ స్టోరేజీలో పెట్టుకున్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో మిర్చి కోతలు కోస్తూనే ఉన్నారు. మిర్చి పంట పూర్తిగా రైతులు ఇళ్లకు చేరలేదు. అకాల వర్షాల కారణంగా శనగ పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఎకరాకు 10 కింటాళ్ల వరకు దేవుడు వస్తుందని రైతులు ఆశించిన, ఎకరాకు ఐదు నుంచి ఆరుకు మించి కాలేదు. ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది. పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నా అకాల వర్షాల కారణంగా దిగుబడులు తగ్గాయి. వర్షాలకు కొన్ని పొలాలు ఉరకెత్తి పోవటంతో, రైతులు పొగాకు మొక్కలను అధిక ధరలకు తెచ్చి ఒకటికి రెండుసార్లు నాటారు. ఇప్పటికీ కొన్నిచోట్ల పూర్తిగా పొగాకు ఇంటికి రాలేదు. పొలాల్లోనే ఉంది. చివరాకులు కూడా రైతులు తీస్తున్నారు. మొక్కజొన్న పైరు ఈ సంవత్సరం ఆశాజనకంగా ఉందని రైతులు అనుకున్నారు. ఎకరాకు సుమారు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావించారు. అయితే ఏప్రిల్ నెలలో వచ్చిన అకాల వర్షం, గాలి కారణంగా మొక్కజొన్న పైరు పడిపోయింది. మే నెల ప్రారంభం నాటికి మొక్కజొన్న కోయాల్సి ఉండగా వర్షాలు కురుస్తూ ఉండటం వలన, ఇప్పటికీ సగం పైరు పొలాల్లోనే ఉంది. పైరు నేల వాలిపోయి ఉండటం వలన మొక్కజొన్న కండెలు ఏరటానికి రైతులకు ఎకరాకు 7 వేల రూపాయల అదనపు భారం పడుతోంది. ధర కూడా విపరీతంగా తగ్గిపోయింది. కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్నలను కొనాల్సిన ప్రభుత్వం సకాలంలో కేంద్రాలు ప్రారంభించకపోవడంతో 2,250 రూపాయలు 1,700కు పడిపోయింది. దీంతో రైతుల్లో నిరాశ ఏర్పడింది. మరో రెండు మూడు రోజుల్లో రబీ సీజన్ పూర్తయి ఖరీఫ్ రాబోతున్న పైర్లు ఇంకా పొలాల్లోనే ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ నెల నుంచి ఖరీఫ్ ప్రారంభం కాబోతోంది. కొంతమంది ఖరీఫ్ ప్రారంభించేందుకు పొలాలను దుక్కులు దున్నుతున్నారు. ఖరీఫ్ అయినా రైతాంగానికి కలిసి వస్తుందో రాదో అనే సందేహంలో ఉన్నారు.



కల్లాల్లో ఉన్న మిర్చి

రక్తదానం శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి, మరియు రెడ్ క్రాస్ సొసైటీ, బాపట్ల డిస్ట్రిక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 3 గంటల వరకు పట్టణంలోని గోపాలరావు వీధి గీతామందిరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తహసీల్దారు, మండల రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి సుబ్బారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సిఎ ఎం రోశయ్య, బ్లడ్ డొనేషన్ రీజనల్ ఛైర్మన్ కొణిదల శ్రీనివాసరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గల్లా సాంబశివరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్ వడ్డమూడి అనిల్ కుమార్, రోటరీ ప్రెసిడెంట్ సందిరెడ్డి శ్రీనివాసరావు, సెక్రటరీ చిన్ని మురళీకృష్ణ, ట్రెజరర్ తమ్మన శ్రీనివాస రావు, రొటేరియన్, రెడ్ క్రాస్ సొసైటీ ఎంసి మెంబర్ బివి కృష్ణారెడ్డి, రోటరీ బ్లడ్ డొనేషన్ ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, పసుపులేటి ఆంజనేయులు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, అద్దంకి లేవి ప్రసాద్, షేక్ మొహమ్మద్ రఫీ, మలాది శ్రీనివాసరావు, అళహరి హరిప్రసాద్, ఊటుకూరు రామకోటేశ్వరావు ఏజిపి వై రమేష్, చప్పిడి వీరయ్య, చందలూరి కష్ణ, జె శివకుమారి, ఎన్ శ్రీలక్ష్మి, కె భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. సందిరెడ్డి శ్రీనివాస రావు అధ్యక్షత వహించిన ఈ సభ లో వక్తలు మాట్లాడుతూ రక్తదానం ఎంతో పవిత్రమైనదని, రక్త దానం వలన రక్తం అవసరమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడిన వారమౌతామని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించిన వడ్డమూడి అనిల్ కుమార్‌ను రోటరీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి-నగరం

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మండల అధ్యక్షులు చింతల శ్రీకష్ణ అధ్యక్షత వహించారు. మండలంలో జరిగే పనులను పర్యవేక్షించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి రాకుండా చూడాలని పంచాయతీల సిబ్బందికి, ఆయా గ్రామ సర్పంచ్‌లను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు పాల్గొన్నారు. ప్రియతమ ముఖ్యమంత్రి మరియు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రేపల్లె నియోజకవర్గం పర్యటన వలన వరాల జల్లు కురిపించారని ఆయన అన్నారు. రోడ్ల విస్తరణ, నూతన రోడ్లను నిర్మించాలని పనులను వెంటనే ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొని కొలగానివారిపాలెం, పెద్దవరం గ్రామాల వాలంటీర్లను సన్మానించారు. మండలంలో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కార్పొరేట్ స్థాయి కన్నా మంచి మార్కులు సాధించారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం శ్రీనివాసరావు, గ్రామ సర్పంచులు, ఎంపిటీసీలు, జడ్పిటిసి నాగమణి, ఎంపీడీవో రాధా రమణ తదితరులు పాల్గొన్నారు.



వాలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీ మోపిదేవి రమణ

ఆలోచింపజేసిన నాటికలు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం వీరన్నపాలెం కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో 7వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. బివి ఆచారి, గోలి సుబ్బారావు కళాప్రాంగణంలో నటరాజ పూజను ఎంపిటిసి సభ్యురాలు పుల్లెల పద్మావతి ప్రారంభించారు. అనంతరం సభ నిర్వహించారు. సభకు ఎం సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా నల్లమడరైతు అధ్యక్షులు కొల్లా రాజామోహన్‌రావు మాట్లాడుతూ కుటుంబ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు నేటి సమాజంలో తరగిపోతున్న మానవతా విలువలను కళ్లకు కట్టినట్లుగా నటన ద్వారా ప్రజల్లోకి వెళ్లే విధంగా ప్రదర్శిస్తున్న నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నేటి సమాజంలో అనేక రుగ్మతలకు, రోగాలకు నాటకరంగం ఒక చికిత్సాలయమని అన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో కొల్లా శుభాష్‌బాబు, పడమటి గాలి రచయిత పాటిబండ్ల ఆనందరావు, ప్రముఖ నటుడు, రచయిత కెఎస్‌టి సాయి, జెట్టి హరిబాబు, కుసుమకోటి శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన నాటికలు ఆహూతులను అలరించాయి. మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ చిలకలూరిపేట వారు ప్రదర్శించిన మృత్యుపత్రం నాటిక ఆలోచింపచేసింది. పండు క్రియేషన్స్ కొప్పోలువారి పక్కింటి మొగుడు నాటిక, హేళాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరి వారి మనసున మనసై నాటిక ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. నేటి సమాజంలో తల్లిదండ్రులపట్ల పిల్లలు ఏవిధంగా ప్రవర్తిస్తున్నారో కళ్లకు కట్టొచ్చినట్లుగా ప్రదర్శించారు.



మృత్యుపత్రం నాటికలోని ఓ సన్నివేశం



క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఉప్పుగుండూరు శాఖ గ్రంథాలయం గ్రంథపాలకురాలు పి నాగరజని పేర్కొన్నారు. వేసవి శిక్షణలో భాగంగా శనివారం ఉప్పుగుండూరు గ్రంథాలయంలో చిన్నారులకు క్యారమ్ బోర్డు ఆటలు, పజిల్స్ గేమ్స్ ఆటల ఆడించారు. కథలు చదివించడంతో పాటు రాయించారు. డ్రాయింగ్ వేయడం నేర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం: కరణం

ప్రజాశక్తి-చీరాల: గ్రామ వార్డు వాలంటీర్ల సేవలు ఎంతో అభినందనీయమని, పథకాలు ప్రజలకు అందించడంలో వారు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వాలంటీర్ల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కరణం, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు ప్రజలతో నిత్యం మమేకమై ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ పథకాల అమలుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. వాలంటీర్లు చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం వారిని సన్మానిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమం ఎంతో హర్షణీయం అన్నారు. అనంతరం పలువురు వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, తహశీల్దారు ప్రభాకర్‌రావు, ఎంపీడీవో నేతాజీ, పలువురు సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-చిన్నగంజాం: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి ప్రతాప్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కడవకుదురు గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో మజ్జిగ పంపిణీ చేయాలని, మెడికల్ కిట్లు అందించాలని ఆయన మండల అధికారులను డిమాండ్ చేశారు.



పశువుల మందులు అందజేస్తున్న బేబీరాణి

చీర్వానుప్పలపాడులో పశువిజ్ఞానబడి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని చీర్వానుప్పలపాడు గ్రామంలో శనివారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ జెడిఎ కె బేబీరాణి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పశు పోషకులు పశువుల పట్ల వేసవిలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రోజుకు రెండుసార్లు చల్లని నీటితో కడగాలన్నారు. ఎండజామున బయటకు విడవరాదని అన్నారు. తద్వారా మంచి పాలదిగుబడి పొందవచ్చని తెలిపారు. సబ్సిడీపై దాణా అందచేయడం జరుగుతుందన్నారు. పశుబీమాపై అవగాహన కల్పించారు. పశువులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే బీమా సొమ్ము వస్తుందన్నారు. అనంతరం పశుపోషకులకు మందులు, దాణా అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మనబ్రోలు పశు వైద్యాధికారి జి వెంకటసురేఖ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరు క్షేత్ర సహాయకుల సస్పెన్షన్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నిబంధనలకు విరుద్ధంగా మస్టర్ వేసినందుకు, పనులు రాని వారికి కూడా మస్టర్ వేసి.. వారి నుంచి డబ్బులు వసూలు చేసినందుకు గానూ ఇద్దరు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేస్తూ పీడీ శీనారెడ్డి ఉత్తర్వులిచ్చారు. ఇటీవల జరిగిన 14వ సామాజిక తనిఖీలో మిల్లంపల్లి, యర్రగొండపాలెం పంచాయతీల పరిధిలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. అక్రమాలకు పాల్పడిన ఎఫ్ఎలు సంద్రపాటి బాబు, తూమాటి వెంకటేశ్వర్లును విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్లు ఏపీవో శైలజ శనివారం తెలిపారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న డిఎంహెచ్ఒ

ముగిసిన వైద్యుల శిక్షణ

సర్టిఫికెట్లు అందజేసిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యాధికారులకు మెడికల్ మేనేజ్ మెంట్ ఆఫ్ అబార్షన్ పై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జిజిహెచ్ ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ శ్రీదేవి, నాలుగు బందాలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా డిఎం,హెచ్ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి వైద్య అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చేయాల్సిన అబార్షన్‌లు నిబంధనలకు లోబడి చట్ట ప్రకారం చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగే అబార్షన్‌లు కేవలం మెడికల్ మేనేజ్‌మెంట్ అబార్షన్స్ అని, మాతృ మరణాలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వైద్యాధికారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పాముకాటు, కుక్క కాటు, ప్రాథమిక చికిత్సలపై శిక్షణ తీసుకున్న ఎంఎల్‌హెచ్‌పిలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

ఎస్‌సి లబ్ధిదారులను గుర్తించండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్షేత్రస్థాయిలో ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ లబ్ధిదారులను గుర్తించాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం ఎస్సీ లబ్ధిదారుల ప్రకతి వ్యవసాయంపై కన్వర్జెన్సీ మీటింగ్‌ను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జడ్‌బిఎన్ఎఫ్ (జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్)లో భాగంగా ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి లబ్ధిదారులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. జిల్లాలో 828 మంది ఎస్‌సి రైతులు ప్రకతి వ్యవసాయం చేస్తున్నారని రైతు సాధికారిక సంస్థ నుంచి ఎస్‌సి కార్పొరేషన్ వైఎస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కి లబ్ధిదారుల జాబితాను అందజేశామన్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఎస్‌సి రైతులు ప్రకతి వ్యవసాయం చేస్తున్నారా.. లేదా.. అనేది పరిశీలన చేయాలన్నారు. ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి లబ్ధిదారులకు సంబంధించి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున ప్రభుత్వం 82 లక్షల 80 వేల రూపాయల సహాయాన్ని మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని నిజమైన ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు, డిపిఎం, ఆగ్రోస్, సీడ్ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పర్యటించి నిజమైన లబ్ధిదారులను త్వరితగతిన గుర్తించాలన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, డిఏఒ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ఆగ్రోస్ జిఎం, సీడ్ కార్పొరేషన్ జిఎం పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లస్థలాలేవీ?

- ప్రభుత్వ వైఖరి వెల్లడించాలి

- సిపిఎం నాయకులు చీకటి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని అందరికీ ఇళ్లు ఇస్తామని, టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు ఇస్తామని పాలకులు చెబుతున్నా ఆచరణలో ఇవ్వటం లేదని సిపిఎం నాయకులు చీకటి శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం ఒంగోలు నగర కమిటీ సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇస్తామని ప్రభుత్వం నాలుగేళ్ళుగా ప్రకటనలు తప్ప ఆచరణలో ఇవ్వడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్థలం కొన్నామని, అందరికీ నెల లోపల ఇస్తామని ప్రకటించారన్నారు. టిడ్కో ఇళ్ల కోసం కొంతమంది డబ్బులు చెల్లించారని, ఇళ్లు రద్దు చేసినా డబ్బును నాలుగేళ్ళుగా తిరిగి చెల్లించడం లేదన్నారు. లబ్ధిదారులు అనేక సార్లు అడిగినా ఇస్తామని చెబుతున్నారు తప్ప ఇవ్వటం లేదన్నారు. ఇళ్లస్థలాల విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. నగరంలో ఎండాకాలంలో శివారు కాలనీలకు ఏడు రోజులకు ట్యాంకర్ నీరు ఇస్తున్నారని, .ప్రజలు మంచి నీటికి అల్లాడి పోతున్నారన్నారు. పైపులైనులు ఉన్న చోట ఎండాకాలంలో నీటి ఎద్దడి ఉందని, మున్సిపల్ పాలక వర్గం పట్టించుకోవడం లేదన్నారు. ట్యాంకర్ల సంఖ్యను పెంచాలని, నీటి ఎద్దడి నివారించాలని, మూడు రోజుకొకసారి మంచినీటిని ఇవ్వాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ నగరంలో చెత్త సేకరణ పన్ను, ఇంటి పన్నులో కలిపి వసూలు చేయడాన్ని వ్యతిరేకించారు. ప్రజలపై చెత్త భారాలు, యూజర్ చార్జీలు మోపడం సరైనది కాదన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలం చెందుతున్నారని, ఏరియాలలో కాలువలు తీయకపోవడం, శివారు కాలనీలలో రోడ్లు, కాలువలు నిర్మాణం చేయట్లేదన్నారు. మున్సిపల్ పాలక వర్గం ప్రజలపై భారాలు మాని ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, నగర కమిటి సభ్యులు ఎమ్‌డి యాసిన్, ఎస్‌డి హుస్సేన్, దారా వెంకటేశ్వర్లు, టి.మహేష్, శ్రీరామశ్రీనివాసులు, కొర్నేపాటి శ్రీనివాసులు, అత్తింటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళల టాయ్‌లెట్స్‌కు

త్వరలో మరమ్మతులు

- పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తాం..

- జిజిహెచ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఒ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఓపీ విభాగాల్లో మూసేసిన మహిళల టాయ్ లెట్స్‌కు త్వరలో మరమ్మ తులు పూర్తి చేసి.. పూర్తి స్థాయిలో అందు బాటులోకి తెస్తామని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బగవాన్ నాయక్, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ చైతన్యవర్మ తెలిపారు. 'ప్రజాశక్తి' టాబ్లాయిడ్‌లో శనివారం ప్రచురితమైన 'మహిళల టాయ్‌లెట్స్ మూసే శారు.!' కథనానికి జిజిహెచ్ అధికారులు స్పందించారు. జీజీహెచ్ ఓపీ విభాగాల్లో మహి ళలకు సంబంధించి టాయ్‌లెట్లని తాత్కాలికం గా మూసివేయడం జరిగిందన్నారు. టాయ్ లెట్‌లకు నీరు అందించే పైపులు బ్లాక్ అవ్వడంతో పాటు సివిల్ పనులు జరుగుతున్న కారణంగానే వాటిని మూసివెయ్యడం జరిగిందే తప్ప మరొకటి కాదన్నారు. ఒక వైపు సివిల్ పనులు జరుగుతున్నా యన్నారు. జిజిహెచ్ లో నిర్మాణ మరియు పైపులు లాంటి నిర్వ హణ మరమత్తులన్నీ ఎపిఎం ఐడిసి వారికి దాఖలు పరచబడి నట్లు తెలిపారు. వాటిని రిపేర్ చెయ్యడం జరుగు తుందన్నారు. మిగిలిన ఓపీ విభాగాల్లో మహిళల మరియు పురుషుల టాయ్‌లెట్లు ఉపయోగంలో వున్నాయని తెలిపారు. పేషెంట్ల మరియు వారి సహాయకుల సౌకర్యార్థం అన్ని రకాల జాగ్ర త్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సరళా వందనంకు ఘన సత్కారం

అభినందించిన జిల్లా అధికారులు



సరళా వందనంను సత్కరిస్తున్న జిల్లా అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బదిలీపై వెళుతున్న వెలుగొండ ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ ఎస్.సరళా వందనంను పలువురు జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ ఎస్.సరళా వందనం పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో సరళా వందనం వీడ్కోలు సభ శనివారం జరిగింది. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ సరళా వందనంను జిల్లా పంచాయతీ అధికారి జివి నారాయణరెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ పిఏ కె.చెంచయ్య, ఎస్‌డిసి ఉమాదేవి, మార్కాపురం, కంభం యూనిట్స్ ఎస్‌డిసి ఎం.రామసుబ్బయ్య, ఉప తహశీల్దార్లు ఎస్‌కె నాయబ్ రసూల్, కె.హిమబిందు, కె.వెంకటేశ్వరరావు, డి.పార్వతి భాయి, ఏ. శ్రీనివాస బాబు, మధు పాల్గొన్నారు.

ప్రమాదంలో పర్యావరణం

సముద్రం కోతకు గురవుతోందని నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీ చేశారు. దీని వల్ల ప్రజానీకం ముంపునకు గురవుతారని అధ్యయనాల్లో వెల్లడించారు. ఇందులో ప్రకాశం జిల్లా తీరప్రాంతం కూడా ఉంది. మిగతా జిల్లాలతో పోలిస్తే ముప్పు కొంత తక్కువగా ఉన్నా ముంపు సమస్య మాత్రం తప్పలేదు. వాతావరణంలో మార్పులు, కాలుష్యం వల్లనే ఈ మార్పు జరిగిందని అధ్యయాల్లో తెలుస్తోంది. సముద్రం ముందుకు వస్తోంది. పరిణామ క్రమంలో భాగంగా జరిగే మార్పులు కూడా తోడవుతాయి. తీరం వెంట ఉన్న గుడులు అనేకం భూమి లోపలికి వెళ్లాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన గుడులను పరిశీలిస్తే చాలా అడుగున ఉన్నాయి. భూభాగం ఎత్తు పెరిగింది. నివాసాలు, నిర్మాణాలు పెరిగాయి. ఫలితంగా పురాతన నిర్మాణాలు భూమి లోపలకు వెళ్లాయి. ఇదంతా పర్యావరణానికి జరిగిన అనర్థాల వల్లనేనని గుర్తించాలి. మరో వైపు ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఒక్క రోజులోనే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తీవ్రమైన ఎండలు కాస్తే మధ్యాహ్నం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. వడగాలులు ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈదురుగాలులతో కూడిన వర్షాలు..పిడుగులు పడుతున్నాయి. పంటలు..ప్రాణ నష్టం తప్పడం లేదు. ఇవి కూడా పర్యావరణ సమతుల్యత లోపం కారణంగానే జరుగుతున్నాయి. పర్యావరణానికి ముప్పు కలిగించే కాలుష్యంపై దృష్టి సారించాలి. ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టాలి. అప్పుడే సమతుల్యతను సాధించగలుగుతాం.



పాలనావ్యవస్థలో ఎన్ని మార్పులు తెచ్చినా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ప్రజాసమస్యలు పరిష్కారం ఎండమావిగానే మారింది. అర్జీల సంఖ్య తగ్గడం లేదు. ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. సచివాలయ వ్యవస్థ ఏం చేస్తోంది? ఇక్కడున్న అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారన్నదీ ప్రశ్నార్థకంగానే మారింది. ఇప్పటికీ జిల్లా కేంద్రానికి కుప్పలు తెప్పలుగా అర్జీలు వస్తున్నాయి. సచివాలయ వ్యవస్థలో అన్ని శాఖల సిబ్బందీ ఉన్నారు. అయినా అక్కడ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు. సంక్షేమ పథకాల జాతర తప్ప మిగతా పనులకు ప్రాధాన్యత లేదని తేలింది. రాజకీయ సిఫార్సులతో జరిగే పనులు తప్ప సామాన్యుడికి అక్కడ న్యాయం ఎండమావిగా మారింది. గిద్దలూరులో కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో 461 అర్జీలు అందాయి. పెద్దఎత్తున జనం వచ్చి సమస్యలు చెప్పుకున్నారు. ఇవన్నీ పరిశీలిస్తే.. ఇళ్ల స్థలాలు, భూముల సమస్యలు, శ్మశానవాటికలు, బీమాలు, వ్యక్తిగత సమస్యలకు చెందినవే.. ఇవన్నీ క్షేత్రస్థాయిలో పరిష్కారం చేయడానికి అవకాశం ఉంది. అన్నీ మండల స్థాయిలో పరిష్కారం చేయాల్సినవే. అయితే వదిలేశారు. ఎవరూ పట్టించుకోలేదు. 22ఎ నుంచి తొలగించాలని వేలాది మంది ఇప్పుడు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. వీటిపైనా నత్తనడకనే చర్యలు కనిపిస్తున్నాయి. భూ సమస్యల్లో ఇవే ఇప్పుడు ఎక్కువగా ఉన్నాయి. ఆన్‌లైన్‌లో భూముల వ్యవహారం ఇప్పుడు పెద్ద పంచాయితీగా మారింది. పాలకపక్ష నేతలు చెబితే ఆన్‌లైన్‌లో నుంచి భూములు క్షణంలో తొలగిపోతున్నాయి. క్షణంలో వేరే వాళ్లవి ఎక్కిస్తున్నారు. ఇప్పుడు సాగు చేసుకుంటున్న వాటిని అమ్మాలన్నా, కొనాలన్నా ఆన్‌లైన్ కీలకంగా మారింది. చేతిలో అన్ని హక్కు పత్రాలున్నా ఫలితం లేకుండా పోతోంది. ఇలాంటి సమస్యలు ప్రతి మండలంలోనూ ఉన్నాయి. సమగ్ర భూసర్వే సాగుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. భూవివాదాలకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపనంత కాలం అర్జీలు వస్తూనే ఉంటాయి.

తెలుగుదేశం నేతలు మహానాడుకు తరలివెళ్లారు. ఒంగోలులో తెలుగుదేశం పార్టీ మహానాడు రెండేళ్ల క్రితం జరిగిన సంగతి తెలిసిందే.. ఇప్పుడు రాజమండ్రిలో నిర్వహిస్తున్నారు. శనివారం నాడు ప్రారంభమైన మహానాడుకు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు తరలివెళ్లారు. ఇటీవలే చంద్రబాబు పశ్చిమాన పర్యటించారు. పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. జిల్లాలో చంద్రబాబు నాలుగు రోజుల పాటు గడిపారు. పార్టీ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. జిల్లా నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. వైపాలెంలో జరిగిన ఘటనలు చర్చకు దారితీశాయి. ఏదేమైనా జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతలు పాలకపక్షంపై గట్టిగానే పోరాడుతున్నారు. అన్ని వ్యవహారాల్లో క్రియాశీలకంగానే ఉన్నారు. ఎన్నికల్లో పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల స్పీడు పెంచారు. ఎన్నికలే ఎజండాగా వ్యూహప్రతివ్యూహాలు సాగుతున్నాయి. ఇప్పుడు మహానాడుకు తరలివెళ్లారు.

పాలకపక్ష నేతలు మళ్లీ గడపగడపకూ ప్రారంభించారు. ఒంగోలులో సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు మంత్రి ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే రాంబాబు తదితరులు ప్రస్తుతం గడపగడపకూ తిరుగుతున్నారు. మిగతా ఎమ్మెల్యేలు కనిపించడం లేదు. పెళ్ళిళ్లు, పేరంటాళ్లు ఇతర కార్యక్రమాల్లో కొందరు కనిపిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కొందరు వదిలేశారు. ఎన్నికల్లో ఎటూ తిరగాలనే ఉద్దేశంతో ఆపేశారా? అనేదీ చూడాలి. కొందరు టిక్కెట్టుపై నమ్మకం లేక ముందుకు సాగడం లేదు. గ్రూపులున్న చోట ఇదే పరిస్థితి నెలకొంది. ఏదేమైనా గడపగడపకూ తిరగడం నేతలకు సవాలుగా మారింది. చేసిన పనులకు బిల్లులు రానందున మండలస్థాయి నాయకత్వం మాత్రం దీనిపై ఉత్సాహంగా ఎవరూ కనిపించడం లేదు. అంతా నైరాశ్యంలోనే ఉన్నారు. ఎమ్మెల్యేలకూ ఇదే సమస్యగా మారింది.